ఆ గ్రామం.. మద్యానికి దూరం

- బెల్ట్ షాప్ ఎత్తేయించిన గ్రామస్తులు
- ఆదర్శంగా నిలుస్తున్న రత్నగిరిపల్లె


రత్నగిరిపల్లె గ్రామ ముఖ చిత్రం

మాచారెడ్డి: మద్యం మత్తులో ముఖ్యంగా యువత దారి తప్పుతున్నారని గ్రహించారు ఆ గ్రామస్తులు. ఇటీవల గ్రామంలో టామ్ టామ్ వేయించారు. ఇంటికొకరు గ్రామ సచివాలయం వద్దకు రావాలని సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు హుకూం జారీచేశారు. యువ సర్పంచ్ శ్రీశైలం అధ్యక్షతన గ్రామస్తులంతా పక్షం రోజుల క్రితం సమావేశమయ్యారు. ముందుగా గ్రామంలో ఉన్న బెల్ట్ షాప్‌ను ఎత్తేశారు. ఇక నుంచి గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహించొద్దని, ఈ నిర్ణయాన్ని ఎవరైనా ధిక్కరించి బెల్ట్ షాప్ నడిపితే రూ.10 వేల జరిమానా విధిస్తామని సమిష్టిగా తీర్మానించారు. మద్యం అందుబాటులో ఉంటే డబ్బులు లేకున్నా మరీ అప్పుచేసి మద్యం తాగి ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు సాక్షికి తెలిపారు. బెల్ట్ షాపు వల్ల గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నప్పటికీ అంత కంటే ఎక్కువ గ్రామస్తుల ఆరోగ్యం పాడవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నామని గ్రామస్తులన్నారు.

ఎన్నో అనర్థాలకు దారి తీస్తోంది



మద్యం బెల్ట్ షాప్ గ్రామంలో ఉండటం వల్ల ఎప్పుడు దొరికితే అప్పుడు మద్యం తాగుతున్నారు. దాంతో ఆరోగ్యం పాడవుతోంది. యువకులే ఎక్కువ శాతం తాగి దారి తప్పుతున్నారు. ఇప్పటి నుంచి యువత చదువుపై శ్రద్ధ పెట్టాలి.

– శ్రీశైలం, సర్పంచ్, రత్నగిరిపల్లి

తాగి వాహనాల మీద నుంచి పడుతున్నారు



గ్రామంలో బెల్ట్ మద్యం షాప్ ఉండడంవల్ల యువకులు తరచుగా తాగుతూ ద్విచక్ర వాహనాల మీద నుంచి పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అందుకే గ్రామస్తులంతా ఏకమై గ్రామంలో మద్యం అమ్మకాలను బంద్ చేయించాం. ప్రతి ఒక్కరూ పంచాయతీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి.

– నర్సింలు, గ్రామస్తుడు, రత్నగిరిపల్లి

క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



నిజాంసాగర్(జుక్కల్): కొత్తగా మహమ్మద్‌నగర్ మండలాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు ఆదివారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫే దార్ శోభరాజు దంపతులు కలిశారు. మహమ్మద్‌నగర్‌ను మండలం చేస్తుండటంతో సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



కామారెడ్డి టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆదివారం జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్, నీలం చిన్నరాజులు, జిల్లా నాయకులు ఇట్టం సిద్ధిరాములు, మోతే కృష్ణాగౌడ్, జూలూరి సుధాకర్, చింతల రమేష్ తదితరులు శాలువాతో రాష్ట్ర అధ్యక్షుడ్ని ఈ సందర్భంగా సత్కరించారు.

టీఎస్ పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థికి 13వ ర్యాంక్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బంజ విజయ శివకుమార్ కుమార్తె బంజ సింధూజ టీఎస్ పీజీ సెట్‌లో 13వ ర్యాంక్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ వెలువరించిన ఫలితాల్లో ఉత్తమ ర్యాంక్ సాధించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా యాదయ్య



కామారెడ్డి టౌన్: ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా భిక్కనూరు యాదయ్యను నియమించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పెంట అంజయ్య నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లాలో జరగబోయే పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షుడు అధికారులను కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానయ్య, జిల్లా కార్యదర్శి అయ్యల సంతోష్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు మద్దతు తెలిపిన రాంపూర్ తండావాసులు



బాన్సువాడ రూరల్: రాంపూర్ తండాకు చెందిన వైస్ ఎంపీపీ హరిసింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, సర్పంచ్ లలితాశ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఆదివారం తండా ప్రజలు రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సీఎం అవకాశం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. తమ తండాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న స్పీకర్‌కు వచ్చే ఎన్నికల్లోనూ సంపూర్ణ మద్దతు ఉంటుందని, భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు.

వైస్ ఎంపీపీ రేసులో బీరయ్య ?

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ వైస్ ఎంపీపీ బరిలో మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ–2 పాపనొల్ల బీరయ్య రేసులో ఉన్నారు. ప్రస్తుతం వైస్ ఎంపీపీగా ఉన్న గాదారి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అధికార పార్టీకి చెందిన 9 మంది ఎంపీటీసీలు గాదారి శ్రీనివాస్ రెడ్డిపై అవిశ్వాసం ప్రకటించారు. దీంతో గాదారి శ్రీనివాస్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రధాన అనుచరుడిగా బీరయ్య కొనసాగుతున్నారు. ఇతర ఎంపీటీసీలు కూడా బీరయ్యకే మొగ్గు చూపడంతో వైస్ ఎంపీపీ పదవి ఆయనకే దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 20 కల్లా వైస్ ఎంపీపీ ఎవరనే విషయం స్పష్టం తెలుస్తుంది.

గో సేవతో ముక్తిమార్గం


ప్రవచనాలు ఇస్తున్న జ్ఞానేశ్వర్ గౌడ్ మహరాజ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గో సేవతో ముక్తిమార్గం లభిస్తుందని జ్ఞానేశ్వర్ గౌడ్ మహరాజ్ అన్నారు. ఆదివారం జగన్నాథ్‌పల్లి తండా సమీపంలో ఉన్న శ్రీకృష్ణానంద గోశాలలో శ్రావణ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోశాల నిర్వాహకులు శ్రీను మహరాజ్ ఆధ్వర్యంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజూ ఈ కార్యక్రమంలో భాగంగా హరిపాట్, కాకడాహారతి, కీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం జ్ఞానేశ్వర్ గౌడ్ మహరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని, ఖాళీ సమయంలో గో సేవ చేసుకోవాలని సూచించారు.

సహకార సంఘంలో పాలకవర్గ సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న పాలకవర్గ సభ్యులు

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ సహకార సంఘంలో ఆదివారం చైర్మన్ నారాయణరెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘంలోని నూతన సభ్యులకు రుణాలు మంజూరు చేయాలని, అదే విధంగా మాఫీ అయిన సభ్యులకు రుణాలు మంజూరు చేయాలని తదితర తీర్మానాలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాయగౌడ్, డైరెక్టర్లు, సీఈవో హన్మాండ్లు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్


మద్నూర్‌లో రోడ్డుపై అడ్డంగా ఉంచిన ఆటోలు

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ ప్రాంతంలో ఆటోలు ఇష్టారాజ్యంగా రోడ్లపై నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక పాత బస్టాండ్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డుపై ప్రయాణికుల కోసం నిలుపుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఎల్లప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల కోసం పోటీ పడుతూ రోడ్లపై ఇష్టం వచ్చినట్లు వాహనాలను పెట్టడంతో వెనక ఉన్న వాహనాలకు దారి ఇవ్వకుండా వాగ్వాదం పెట్టుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు పాత బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఆటో డ్రైవర్లతో ఇబ్బందులు కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బారడి పోచమ్మ బోనాల పండగ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బారడి పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బారడి పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామ శివారులోని బారడి పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో పాల్గొన్న కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు అరుణతార, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపారవేత్త పత్తి సంతోష్ గుప్తా మహా అన్నదానం చేశారు.

ఎల్లారెడ్డిలో గంగమ్మ తల్లికి బోనాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో గంగమ్మ తల్లికి బోనాల పండగను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన



బాన్సువాడ రూరల్: చిన్న రాంపూర్‌లో ఆదివారం ఊరడమ్మ, మహంకాళి అమ్మవార్ల విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా కలిసి ఉదయం మంగళహారతుల నడుమ విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పవిత్ర యజ్ఞం నిర్వహించారు. వేదపండితులు వెంకట్రావ్ దీక్షితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సర్పంచ్ ఈశ్వరీరేఖ, ఉప సర్పంచ్ షేక్ అజీమ్, నాయకులు పర్వుగొండ ,మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాస భజనలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అమర్లబండ, కుప్రియాల్, కల్వరాల్, భూంపల్లి, ధర్మారావ్‌పేట్ తదితర గ్రామాల్లో శ్రావణమాస నిత్య భజనలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు అక్కం విష్ణు, ప్రధాన కార్యదర్శిగా మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రామకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లాలో లెక్చరర్ల సమస్యల పరిష్కారిని కృషి చేస్తామని వారు అన్నారు. నాయకులు ఫణి కుమార్, గంగాధర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, రమేష్, దుర్గయ్య, శ్రీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశానికి పూర్తి స్థాయి నివేదికతో హాజరు కావాలి



పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత పేర్కొన్నారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. 6న బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి అధికారులు పూర్తి స్థాయి నివేదికతో సకాలంలో హాజరు కావాలని, అదే విధంగా మండల ప్రజా ప్రతినిధులు కూడా హాజరు కావాలని కోరారు.

ఆర్మీ జవాన్‌గా ఎంపికైన యువకుడికి సన్మానం



దోమకొండ: సీతారాంపూర్‌కి చెందిన మడతల శ్రావణ్ కుమార్ ఇటీవల ప్రభుత్వం నియమించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో జవాన్‌గా ఎంపికయ్యారు. ఆర్మీ జవాన్‌గా ఎంపికైన శ్రావణ్ కుమార్‌ను ఆదివారం ముదిరాజ్ సంఘం ప్రతినిధులు సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు పున్న లక్ష్మణ్, ప్రతినిధులు కడారి రమేష్, కొండ శ్రీను, నాగారపు ఎల్లయ్య, అంజిమ్, వెంకటి, రాజేందర్, లింగం, సత్యం, తదితరులు ఉన్నారు.

'గొడవలొద్దు- రాజీలు ముద్దు'ను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి/రాజంపేట: ఉచిత న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 'గొడవలు వద్దు-రాజీలు ముద్దు' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు, రాజంపేట ఎస్సై సంపత్‌లు వేర్వేరుగా అన్నారు. కామారెడ్డి కోర్టులో ఈ నెల 9 వరకు లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. యాక్సిడెంట్, ఫైటింగ్, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, దొంగతనాలు, ఇతర రాజీపడని కేసులను ఉచితంగా కాంప్రమైజ్ చేసుకునేవారు తమ ఆధార్‌కార్డుతో కామారెడ్డిలోని కోర్టులో రావాలని కోరారు.

ఎల్లారెడ్డిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 9 వరకు ఎల్లారెడ్డిలో 'నేషనల్ లోక్ అదాలత్' ద్వారా పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించనున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. లింగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజీ పడాలనుకున్న వారు తమ ఆధార్ కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. వివరాలకు 8712686162, 9963595580 నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

కురిసిన వర్షం.. ఆనందంలో రైతులు


పిట్లంలో కురుస్తున్న వర్షం

తాడ్వాయి/పిట్లం: ఖరీఫ్ ప్రారంభమై 3 నెలలు గడుస్తున్నా వర్షాలు సరిగ్గా కురివకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడ్వాయి, పిట్లం పరిధిలో ఆదివారం భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

20 రోజుల నుంచి ఎండలు ఎక్కువగా ఉండడంతో ఏపుగా పెరిగిన పంటలు చేతికి వస్తాయో లేదోనని రైతులు ఆందోళనకు గురయ్యారు. రెండు మండలాల్లో ఎక్కువగా మొక్క జొన్న, పత్తి, సోయా పంటలను సాగు చేశారు. పంటలు ఎండి పోయే సమయంలో వర్షం కురియడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


బీర్కూర్‌లో పరిశీలిస్తున్న ఆర్డీవో భుజంగరావు


అర్గొండలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

బాన్సువాడ/రాజంపేట/ఎల్లారెడ్డి: బీర్కూర్, రాజంపేట, ఎల్లారెడ్డి మండలాల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం బాన్సువాడ ఆర్డీవో భుజంగ రావు, రాజంపేట ఆర్డీవో ప్రభాకర్, ఎల్లారెడ్డి తహసీల్దార్ సురేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలోని ఓట్ల వివరాలు, మౌలిక వసతుల గురించి సంబంధిత బీఎల్‌వోలను ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీర్కూర్ ఆర్ఐ సురేందర్‌రెడ్డి, రాజంపేట తహసీల్దార్ అనిల్ కుమార్, ఎల్లారెడ్డి డీటీ సంఘమేశ్వర్ ఉన్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 740 దరఖాస్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 740 దరఖాస్తులు వచ్చినట్లు ఎలక్షన్ డీటీ రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు కోసం ఫారం–6కు సంబంధించి, 549, ఫారం–7కు 52, ఫారం–8కు 139 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.

ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం కొత్తగా ఓటు హక్కు నమోదుకు దరఖాస్తులను స్వీకరించాలని సూపర్ వైజర్ చంద్రభాను తెలిపారు. మండలంలో 36 పోలింగ్ స్టేషన్లకు గాను ఇప్పటి వరకు 286 దరఖాస్తులు వచ్చాయన్నారు.


ఎల్లారెడ్డిలో..పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్


నిజాంసాగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తూ..

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


శెట్పల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. వారిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని, యువతకు అపోహాలను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు వినాయక మండపాల ఏర్పాటుపై సమావేశం

భిక్కనూరు: సిద్ధరామేశ్వరనగర్‌లో సోమవారం రాత్రి 7 గంటలకు వినాయక మండపాల ఏర్పాటుపై సమావేశం ఏర్పాటు చేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి వినాయక విగ్రహాల కమిటీ వారు తప్పనిసరిగా హాజరు కావల్సిందిగా కోరారు.

బీసీ బంధు చెక్కుల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో సోమవారం బీసీ బంధు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు ఎల్లారెడ్డికి వెళ్లి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేతుల మీదుగా అందుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోండి

బాన్సువాడ రూరల్: ఇంటర్ పాసైన విద్యార్థులు సోమవారం సాయంత్రంలోపు డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ కోరారు. బీఏ ఇంగ్లీష్ మీడియంలో 50 సీట్లు, తెలుగు మీడియంలో 33 సీట్లు, బీకామ్ కంప్యూటర్ కోర్సులో 80, లైఫ్‌సైన్స్ కోర్సులో 62, ఫిజికల్ సైన్స్‌లో 117 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

6న పెద్దమ్మ తల్లి మందిరానికి భూమి పూజ



బాన్సువాడ: బాన్సువాడలో ఈ నెల 6న నిర్వహించే పెద్దమ్మ తల్లి మందిరానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు ముదిరాజ్ సంఘం మండల, పట్టణ అధ్యక్షుడు గడుమల లింగమేశ్వర్, ఉప్పరి లింగంలు తెలిపారు. ఆదివారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిని, పోచారం శంభూరెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.